


quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY తెలుగు దినపత్రిక




| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 143 | సోమవారం | 16-02-2026 | వెల: 3 రూ./- | పేజీలు : 8 |
|---|---|---|---|---|---|---|
| MALKAJGIRI | Volume: 3 | Issue: 143 | Monday | 16-02-2026 | Price: ₹3/- | Pages: 8 |



# ఆపరేషన్ 90

## హంగ్ మున్సిపాలిటీలపైనే కాంగ్రెస్ లక్ష్యం

**పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ**

**ఇప్పటికే దాదాపు 70 మున్సిపాలిటీలను గెలుచున్న అధికార పార్టీ**

**నేడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక**

**పోటాపోటీగా క్యాంపు రాజకీయాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి15 (క్విక్ టుడే న్యూస్):

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచిన కాంగ్రెస్... ఇప్పుడు హంగ్ ఏర్పడిన పలు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను హస్తగతం చేసుకునేలా ప్రయత్నాలు ప్రారంభించింది. సోమవారం మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అయితే ఈలోపు హంగ్ ఏర్పడిన పలు మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుంది. కాంగ్రెస్ ఇప్పటికే 66 మున్సిపాలిటీలలో చైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకునేందుకు అవసరమైన సంఖ్యను సాధించగా... హంగ్ ఏర్పడిన పలు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడం ద్వారా మొత్తంగా 90 మున్సిపాలిటీలను ఖాతాలో వేసుకోవాలని చూస్తుంది. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం రోజున పలువురు మంత్రులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సోమవారం రోజున మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ల పదవులకు ఎన్నికలు జరిగే వరకు హై అలర్ట్‌లో ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాంగ్రెస్ దాదాపు 70 మునిసిపాలిటీలను గెలుచుకుందన్న సీఎం రేవంత్ రెడ్డి... మొత్తంగా ఆ సంఖ్య 90కి పైగా మునిసిపాలిటీలను



దాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలో విజయం సాధించిన స్వతంత్రులు, తిరుగుబాటు అభ్యర్థులతో చర్చలు జరపాలని చెప్పారు. వారు తమ వార్డులు, పట్టణాల అభివృద్ధి దృష్ట్యా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉంటే... వారిని పార్టీలోకి చేర్చుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన సభ్యులను ప్రభావితం చేయడానికి ప్రతిపక్ష పార్టీలు ఏవైనా ప్రయత్నాలను చేస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.



# ఇషాన్ షాట్లకు పాకిస్తాన్ పరేషాన్

**టీ20 ప్రపంచకప్‌లో పాక్ చిత్తుగా ఓటమి**

**61 పరుగుల తేడాతో దాయాదిపై భారత్ విజయం**

**సూపర్ 8కు చేరుకున్న టీమిండియా**

కొలంబో, ఫిబ్రవరి15:

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌ను భారత్ మరోసారి చిత్తుగా ఓడించింది. పొట్టి కప్పు టోర్నీలో పాకిస్థాన్ ను మట్టికరిపించింది. ఆదివారం కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్‌ను 61 పరుగుల తేడాతో ఓడించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన టీమ్‌ఇండియా, దాయాది జట్టుపై తమ ట్రాక్ రికార్డ్‌ను మెరుగుపరుచుకుంది. తాజా విజయంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత్ సూపర్ 8 దశకు దూసుకుపోయింది. 176 పరుగుల లక్ష్య ఛేదనలో దిగిన పాక్ బ్యాటర్లకు భారత్ బౌలర్లు చుక్కలు చూపించారు. పాకిస్థాన్ 18 ఓవర్లలోనే 114 పరుగులు చేసి ఆలౌటైంది. ఉస్మాన్ ఖాన్ (44 పరుగులు) ఒక్కడే రాణించాడు. జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, హార్దిక్ పాండ్య తలా 2 వికెట్లు పడగొట్టారు. కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మ చెరో 1 వికెట్ పడగొట్టారు. దీంతో ఈ వరల్డ్‌కప్‌లో భారత్ వరుసగా మూడు విజయాలు నమోదు చేసింది. సూపర్ హాఫ్ సెంచరీతో రాణించిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు' లభించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్ (77 పరుగులు) హాఫ్ సెంచరీతో రాణించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. పాకిస్థాన్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3, సల్మాన్ అఘా, షహీన్ అఫ్రిది, ఉస్మాన్ తారిఖ్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

# పోటెత్తిన భక్తజనం

**శివనామస్మరణలతో మార్మోగిన శైవ క్షేత్రాలు**

**పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మంత్రులు**



హైదరాబాద్, ఫిబ్రవరి15 (క్విక్ టుడే న్యూస్):

మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణలతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగుతున్నాయి. పరమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మహాశివుడిని ప్రార్థిస్తున్నానన్న సీఎం, ఉపవాస పూజలు చేస్తున్న భక్తులకు శివయ్య ఆశీర్వాదం ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ శైవ క్షేత్రం వేములవాడలో శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. భీమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామివారికి ప్రభుత్వం తరఫున మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు. భీమన్నను దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. నల్గొండ జిల్లా పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.



# అన్ని తండాలు, గూడేలకు బీటీ రోడ్లు

**ప్రతి గ్రామ పంచాయతీలో పాఠశాల, పంచాయతీ భవనం**


**వచ్చే ఏడాదికల్లా శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రం నిర్మాణం**

హైదరాబాద్, ఫిబ్రవరి15 (క్విక్ టుడే న్యూస్):

తెలంగాణలోని అన్ని తండాలు, గూడేలకు తప్పనిసరిగా బీటీ రోడ్డు ఉండాలని, అందుకోసం స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కనెక్టివిటీ కోసం బీటీ రోడ్డుతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలో పాఠశాల, పంచాయతీ భవనం ఉండాలని చెప్పారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బంజారా భవన్‌లో జరిగిన సంత్ శ్రీ సేవాలాల్ జయంత్యుత్సవాల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. నల్లమల అటవీ ప్రాంతంలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. వచ్చే ఏడాది సేవాలాల్ జయంతి ఉత్సవాలను అక్కడే నిర్వహించుకునేలా, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా అత్యద్భుతంగా పుణ్యక్షేత్రాన్ని నిర్మిస్తామని అన్నారు. ఆదివాసీలకు ఆదిలాబాద్‌లో నాగోబా దేవాలయం, మేడారంలో సమ్మక్క – సారలమ్మ పుణ్యక్షేత్రం ఉన్నట్టుగా బంజారాలకు ప్రత్యేక క్షేత్రం లేదని పేర్కొన్నారు. అందుకోసం నల్లమల అటవీ ప్రాంతంలో 20 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించినందున, అక్కడ బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ప్రపంచంలోనే బ్రహ్మాండమైన పుణ్యక్షేత్రంగా, గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. “మానవజాతి శాంతి మార్గంలో, చెడును విడిచి, భక్తితో సన్మార్గంలో నడవాలని బోధించిన సంత్ సేవాలాల్ దేశంలో 15 కోట్ల మంది గిరిజనులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. అలాంటి మహనీయుని జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, పునర్నిర్మాణంలో లంబాడా సోదరుల పాత్ర ఎవరూ మరువలేనిది. వారికి సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వంలో సముచిత స్థానం, గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. 2006 నుంచి ఇప్పటివరకు ప్రతి సందర్భంలోనూ లంబాడా సోదరులు నాకు అండగా నిలబడ్డారు. ప్రతి తండాలో పాఠశాల భవనం, పంచాయతీ భవన నిర్మాణానికి స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలి.

# వాణిజ్య ఒప్పందం రైతులకు ద్రోహం


**కేంద్రంపై రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి15:

భారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ, ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు.

# మార్చి 9న స్పీకర్‌పై అవిశ్వాసం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి15:

పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాల ప్రారంభం మార్చి 9న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పదవి నుంచి తొలగించేందుకు విపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు ఆదివారం తెలిపారు. నిబంధనల ప్రకారం సమావేశాల తొలి రోజే ఈ చర్చ చేపట్టాలని చెప్పారు. ఓం బిర్లా స్పష్టంగా విపక్షాలపై పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని విపక్షం ఆరోపించి ఆయనపై అవిశ్వాసానికి నోటీస్ ఇవ్వడంతో చర్చ అనివార్యమైంది. కాగా, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు బడ్జెట్ మలి విడత సమావేశాలు ఉంటాయని ఆయన తెలిపారు.